క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న సర్పంచ్ చిట్టమ్మ, ఉప సర్పంచ్ శ్రీను

అడ్డతీగల: మండలంలోని అనిగేరు గ్రామంలోని ముళ్ళ పాపయమ్మ కిరాణా షాపు ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ పప్పుల చిట్టమ్మ, ఉప సర్పంచ్ ముప్పన శెట్టి శ్రీను , ఎంపీటీసీ సభ్యులు వడ్లమూరి రత్నం, అమ్మాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.5వేల నగదు, నిత్యావసర సరకులను వారు అందజేశారు. సచివాలయం కార్యదర్శి గారు కోసూరి నాగమణి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో పాల్గొన్న ఉద్యోగులు

సీలేరు. విద్యుత్ సంస్థలో దశాబ్దాలుగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు తమ సాధారణమైన డిమాండ్లను నెరవేర్చాలనే నినాదంతో సీలేరులోని ఏపీ జెన్‌కోలో ఉద్యోగులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. విద్యుత్ ఉద్యోగుల తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కారానికి జేఏసీ కేంద్ర కమిటీ పిలుపుతో జరుగుతున్న ఈ దీక్షలకు పలువురు సంఘీభావం తెలుపుతున్నారు. జెన్‌కో డివిజనల్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలో ఉన్న పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ తమ న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చడంలో ప్రభుత్వ వైఖరి దారుణమన్నారు. జేఏసీ సభ్యులు అప్పలరాజు, వెంకటేశ్వరరావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



శబరి కొత్తగూడెంలో బోరు ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కూనవరం: శబరి కొత్తగూడెంలో అందుబాటులో రానున్న బోరును గ్రామస్తులు సద్వినియోగం చేకోవాలని ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్ కట్టం లక్ష్మి అన్నారు. కొండ్రాజుపేట పంచాయతీ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో శబరి కొత్తగూడెంలో కొత్తగా చేతి బోరు ఏర్పాటుకు వారు శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. పీసా కమిటీ కార్యదర్శి కుంజా శ్రీను, వార్డు సభ్యులు వెంకయ్య, వెంకమ్మ, రామయ్య, తమ్మయ్య, వెంకటరావు, హరనాథ్, బుల్లెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి



చెల్లారత్నం (ఫైల్)

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన తోట చెల్లారత్నం (55) ఇంట్లో పనిచేస్తుండగా గోడ కన్నంలోంచి వచ్చిన పాముకాటు వేయడంతో ఆమె శనివారం మృతి చెందారు. పాముకాటుకు అస్వస్థతకు గురైన చెల్లారత్నంను కుటుంబీకులు హుటాహుటిన రాజవొమ్మంగి పీహెచ్‌సీకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆమెను108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్టు కుటుంబసభ్యులతో పాటు సర్పంచ్ చీడి శివ తెలిపారు.

గురజాడకు ఘన నివాళి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు

అనకాపల్లి టౌన్: స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో అభ్యుదయ పితామహుడు గురజాడ అప్పారావు జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 21న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ జి. గణేష్ ప్రసాద్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గురజాడ రచనలు ఈ నాటికి ప్రజల మన్ననలను పొందుతున్నాయన్నారు. విజేతలకు బహుమతులను అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- వాడవాడలా పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు
- విస్తృతంగా మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు



అరకులో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు



అడ్డతీగలలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి సతీష్



అరకులోయలో ప్రతిజ్ఞ చేస్తున్న మండల పరిషత్, అటవీ శాఖ అధికారులు



అరకులోయలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న అధికారులు



గోమంగిలో మొక్కలు నాటిన జెడ్పీటీసీ బొంజుబాబు. వైద్యాధికారి చైతన్య



కళాశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్, తదితరులు



హుకుంపేటలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ రాజుబాబు, అధికారులు



ముంచంగిపుట్టులో ర్యాలీ చేస్తున్న అధికారులు



గంగవరం గ్రామపంచాయతీలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ అక్కమ్మ తదితరులు

అరకులోయటౌన్/ముంచంగిపుట్టు/హుకుంపేట/జి.మాడుగుల/చింతపల్లి/సీలేరు/రంపచోడవరం/అడ్డతీగల/గంగవరం: జిల్లా వ్యాప్తంగా శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం చేకూరుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. కాలుష్యం నుంచి విముక్తి పొందాలంటే పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలన్నారు. పర్యావరణానికి విఘాతం కలిగించే ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అరకులోయలో జరిగిన కార్యక్రమంలో ఫారెస్టు రేంజర్ కోటేశ్వరరావు, ఈవోపీఆర్డీ వి.సత్యనారాయణ, ఉపాధి ఏపీవో జగదీష్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, ఎన్ఎస్ఎస్ పీవో విజయలక్ష్మి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చలపతిరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శెట్టి రోజారాణి, కొర్రా మీన, అధ్యాపకులు లచ్చన్న, గణేష్, మహేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ధర్మారావు, ఏవో మురళీకృష్ణ, ఏపీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం కళావతి, నవనిర్మాణ సమితి మేనేజర్ కుమార్, పంచాయితీ కార్యదర్శులు సింహాచలం,సూర్య తదితరులు పాల్గొన్నారు. హుకుంపేటలో ఎంపీపీ కూడా రాజుబాబు , ఎంపీడీవో రమాదేవి, ఎంఈవోలు సోమెలి చెల్లయ్య, ఈశ్వరరావు, ఏవో సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు. జి.మాడుగులలో ఎంపీపీ లొంబోరి అప్పలరాజు, ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజ్, ఎంపీటీసీ మత్స్యరాస విజయ కుమారి, సర్పంచ్‌లు రాంబాబు, సూరిబాబు, పీఆర్ ఏఈ మాణిక్యం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఏపీవో కొండబాబు, ఏపీఎం ఈశ్వర్‌బాబు, ఎంఈవో బాబూరావుపడాల్ తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, సర్పంచ్ దురియా పుష్పలత తదితరులు పాల్గొన్నారు. సీలేరులో జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరంలో మాజీ సర్పంచ్ రామకృష్ణదొర పాల్గొన్నారు. అడ్డతీగలలో వైద్యాధికారి పండా సతీష్, డాక్టర్ ప్రసన్నదేవి, తదితరులు పాల్గొన్నారు. గంగవరంలో సర్పంచ్ కలుముల అక్కమ్మ, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, పావని, ప్రభ, బుల్లియమ్మ, ఏపీవో ప్రకాష్, ఏవో లక్ష్మణరావు పాల్గొన్నారు.



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో డేవిడ్‌రాజు తదితరులు



చింతపల్లిలో మొక్కలు నాటుతున్న ఎంపీపీ అనూషదేవి , ఎంపీడీవో సీతామహాలక్ష్మి



సీలేరులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



రంపచోడవరంలో మొక్కలు నాటుతున్న రామకృష్ణదొర

మూతబడిన ఏటీఎంలు.. తప్పని అవస్థలు



ముంచంగిపుట్టులో మూతబడి ఉన్న ఎస్‌బిఐ ఏటీఎం



ఏటీఎం బయట నిరీక్షిస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గల ఎస్‌బీఐ ఏటీఎం గత మూడు నెలలుగా మూతబడే ఉంది.దీంతో వినియోగదారులు ప్రతి రోజు అవస్థలు పడుతున్నారు.ఏటీఎం పరిస్థితిపై ఎస్‌బీఐ అధికారులకు ప్రశ్నిస్తే సాంకేతిక సమస్య షాక్ చెప్పడం పట్ల వినియోగదారులు మండిపడుతున్నారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చి ఏటీఎం మూసి ఉండడం పట్ల వినియోగదారులు తీవ్ర నిరాశతో వెనుతిరుగుతున్నారు. నగదు కోసం బయట వినియోగదారుల కేంద్రాలను సంప్రదిస్తే వెయ్యి రూపాయాలకు రూ.10 నుంచి రూ.20ల చొప్పున్న తీసుకుంటున్నారని, తప్పనిసరి పరిస్థితిలో నదగును పొందాల్సి వస్తుందని వినియోగదారులు వాపోయారు. ఇప్పటికైనా ఎస్‌బీఐ అధికారులు నిత్యం ఏటీఎం తెరిచి ,డబ్బులు ఏటీఎంలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.దీనిపై ఎస్‌బీఐ మేనేజర్ కొర్ర శ్రీనివాసరావును వివరణ కోరగా ఏటీఎం మిషన్ పాడైన విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేడంతో కొత్త సామాగ్రి పంపించడం జరిగిందని, త్వరలోనే ఏటీఎం బాగు చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు.

అసత్య ఆరోపణలు తగవు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి పద్మారావు మాట్లాడుతూ అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు వస్తున్న ప్రజాభిమానాన్ని చూసి ఓర్వలేక కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని, ఇది తగదన్నారు. ఆయన అతి సాధారణ కుటుంబం నుంచి వచ్చి నేడు జగనన్న ప్రోత్సాహంతో, ప్రజాభిమానంతో ఎమ్మెల్యే స్థాయికి చేరుకున్నారన్నారు. ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా సాధారణ జీవితం గడుపుతూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ మంచి పేరు పొందిన ఎమ్మెల్యేపై కొంతమంది కావాలని ఆరోపణలు చేస్తున్నారని, దీనిని మండల వైఎస్సార్‌సీపీ కమిటీ ఖండిస్తుందన్నారు. సుజనకోట ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి సుబ్బలక్ష్మీ, ఏనుగురాయి సర్పంచ్ సిరగం నరసింగరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ముఖి రాం ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతపై అవగాహన



గోమంగిలో అవగాహన కల్పిస్తున్న ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ప్రతాప్ తదితరులు



తామరపల్లిలో అవగాహన కల్పిస్తున్న ప్రజాప్రతినిధులు



అప్పలరాజుపేటలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సతీష్

పెదబయలు/రంపచోదవరం/రాజవొమ్మంగి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో స్వస్థ్ నారి సశక్త్ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్య భద్రతపై అవగాహన ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైద్యులు, అధికారులు మాట్లాడుతూ మహిళలు, కౌమార దశలో ఉన్న బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, పోషకారం ఆవశ్యకతను వివరించారు. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు.రక్తహీనత లేకుండా చూసుకోవాలన్నారు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య భద్రతపై అవగాహ కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించి రోగులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. పెదబయలులో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ టి.ఎన్.ప్రతాప్, వైద్యాధికారి చైతన్య, పీహెచ్ఎన్‌వో భూలోకమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. రంపచోడవరంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మిర్తివాడ ఆనంద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ, డాక్టర్ సుజిత, సీహెచ్‌ఓ అన్నపూర్ణ, సత్యనారాయణ, ఎఫ్ఎన్ఓ సుభద్ర, తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ సతీష్. సర్పంచ్ రమణి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలపై ప్రచారం



ముంచంగిపుట్టు వారపు సంతలో ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సీహెచ్‌సీ, లబ్బూరు, రూడకోట పీహెచ్‌సీల్లో ఈనెల 22న నిర్వహించనున్న వైద్య శిబిరంపై స్థానిక వారపు సంతల్లో శనివారం ఆటో ద్వారా ప్రచారం చేశారు. కంటి సమస్యతతో బాధపడేవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మండల ఆప్తమాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి(విజయనగరం), జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక వైద్య నిపుణులతో ఉచిత నేత్ర వైద్య శిబిరాలు జరుగుతాయని,ఈ అవకాశాన్ని నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేత్ర వైద్య శిబిరానికి వచ్చే వారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు, ఫోన్ నెంబర్‌తో హాజరు కావాలని సూచించారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి అదే రోజు విజయనగరం తరలిస్తామన్నారు. వారికి ఉచితంగా రవాణ, వసతి, భోజనం కల్పించనున్నట్టు ఆయన తెలిపారు.

వాడ్రాపల్లిలో కుంకుమార్చన



పూజలు చేస్తున్న భక్తులు

మునగపాక: వాడ్రాపల్లి రామాలయం ప్రాంగణంలో కుంకుమార్చనకు మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక సేవా కర్త పెతకంశెట్టి రామజోగినాయుడు మాట్లాడుతూ నెల రోజులుగా ఇక్కడ పెదరామాలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మ పరిరక్షణకు పాటు పడాలన్నారు.

నకిలీ ధ్రువపత్రాల జారీపై విచారణకు డిమాండ్



నకిలీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న నూకదొర సంక్షేమ సంఘం నేతలు

గూడెంకొత్తవీధి: నకిలీ కులధ్రువీకరణ పత్రాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ నూకదొర సంక్షేమ సంఘం శనివారం డిమాండ్ చేసింది. పాడేరులో శనివారం ట్రైనీ కలెక్టర్ సాహితిని కలిసి వినతిపత్రం అందజేసినట్టు పాడేరు డివిజన్ నూకదొరల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణ, రింతాడ ఉప సర్పంచ్ సోమేష్ కుమార్, సభ్యులు చంటిబాబు, అక్మణ్ తెలిపారు. రింతాడ పంచాయతీలో నూకదొర పేరిట ధ్రువీకరణపత్రాలు పొందిన తోలుబొమ్మల తెగకు చెందిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.ఇప్పటి వరకు వారికి ఇచ్చిన సర్టిఫికెట్లపై విచారణ నిర్వహించి మొత్తం రద్దు చేయాలని కోరారు.దీనిపై సానుకూలంగా స్పందించిన ట్రైనీ కలెక్టర్ సాహితి త్వరలో గ్రామసభ నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు రీమెల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థికి అభినందనలు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇక్కడ 9వ తరగతి చదువుతున్న వి. కిశోర్ అనకాపల్లి మండలం మార్టూరులో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలో అండర్ – 14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. హెచ్ఎం నాయుడు, విద్యా కమిటీ చైర్మన్ తదితరులు అభినందించారు.

172 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



రక్తదానం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ పోలీసులు

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 172 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చైతన్యకుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ చైతన్యకుమార్ అధ్యక్షతన ఎంపీపీ కడబాల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఈ శిభిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో సూపరింటెండెంట్‌తోపాటు పలువురు మాట్లాడుతూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజి ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, గ్రామపెద్దలు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యాధికారులు గైనికాలిస్టు బీబీ ముమీన, ఈఎన్‌టీ స్పెషలిస్టు క్రాంతికిరణ్, కంటి వైద్యాధికారి సృజన, చిన్నపిల్లల స్పెషలిస్టు జీవన్, మస్తాన్, సంతోష్, హోమియో వైద్యాధికారి శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో 15 మంది రక్తదాతలు

స్థానిక హెచ్‌సీలో శనివారం ఆస్పత్రి సూపరింటెండెంటు డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో ఉన్న సీఆర్‌పీఎఫ్ జి–42 బెటాలియన్ అదనపు బలగాలకు చెందిన 10 మంది పోలీసులతో పాటు మరో ఐదుగురు ఆస్పత్రి సిబ్బంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరం విజయవంతమైంది. దాతలకు పాలు, పండ్లు అందజేశారు.

క్రైస్తవ సభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏలీషారావు తదితరులు

అరకులోయటౌన్: అరకు సంతబయలులోని బాప్టిస్ట్ చర్చి వద్ద వచ్చే నెల 7,8 తేదీల్లో రాకడ సిద్ధపాటు క్రైస్తవ సభలు నిర్వహించనున్నట్టు డుంబ్రిగుడ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ వంతాల ఏలీషారావు తెలిపారు. ఈ సభలకు సంబంధించిన పోస్టర్‌లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైబిల్ మిషన్ (రాజమండ్రి) ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సభలు రెండు రోజుల పాటు సాయంత్రం 6 గంటల నుంచి జరుగనున్నట్టు తెలిపారు. బిషఫ్ రెవరెండ్ డాక్టర్ ఎస్.విజయరాజు పాల్గొని దైవ వర్తమానం అందిస్తారన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అరకులోయ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యదర్శి రెవరెండ్ బి.ఇ.సంజీవ్ కుమార్, పాస్టర్లు రెవరెండ్ ఎ.యస్. బాబురావు, మదన్, ఏలీయారాజు, యూదా మరియు క్రైస్తవ సంఘ నాయకులు నాగేశ్వరరావు, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



లంబసింగిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సౌజన్య

చింతపల్లి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని లంబసింగి సూపర్‌వైజర్ జి.సౌజన్య అన్నారు.లంబసింగిలో పోషన్ మా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సర్పంచ్ కొర్రా శాంతికుమారి ఎంపీటీసి సభ్యురాలు నాగమణి, అంగన్‌వాడి కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐదో షెడ్యూల్ ప్రాంతం విలీనం తగదు

కొయ్యూరు: ఐదో షెడ్యూల్‌లో ఉన్న కొయ్యూరు మండలాన్ని మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు తగవని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొట్టడం రాజుబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి జిల్లాలో అనంతగిరి మండలంలో ఐదు పంచాయతీలు మినహా అన్ని ఐదో షెడ్యూల్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కొన్ని పంచాయతీలు అనకాపల్లి జిల్లాను ఆనుకుని ఉండడంతో అక్కడున్న టీడీపీ గిరిజనేతర నాయకులు గిడ్డి ఈశ్వరి ద్వారా అమరావతి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గిరిజన వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఆదివాసీలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు నాయకులు

సీలేరు: ఏపీ జెన్‌కో ట్రాన్స్‌కోలో దీర్ఘకాలికంగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యాలు తక్షణమే రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు బి.లక్ష్మణ్. విష్ణుమూర్తి డిమాండ్ చేశారు. శనివారం ఈ జెన్ కో కార్యాలయం ఎదుట కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని, కార్మికులకు రూ.46వేల జీతం చెల్లించాలని, 2022 పీఆర్‌సి ప్రకారం ఎరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.